క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని ఇందుగపల్లిలో సోమవారం మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదివారం తెలిపారు. ఇందుగపల్లిలో ఉదయం 10 గంటలకు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గోపాలపట్నంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఈ వైద్య శిబిరాన్ని సందర్శిస్తారన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పారాయణ పఠనం



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పలు పారాయణాలు పఠించారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ప్రత్తిపాడు: కవయిత్రి మొల్ల జయంతిని (మార్చి13) రాష్ట్ర ఉత్సవంగా జరపాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడం పట్ల రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్ళకుర్తి నాగమణి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీఓ విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురోషోత్తంకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుమ్మరి శాలివాహనలకు జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కోటనందూరు: కాకినాడలో ఈ నెల 17న బెస్ట్ కెరీర్స్ ఇండియా ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రమణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, పేటీఎం, మెట్‌లైఫ్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన 40 సంవత్సరాలు లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ. 40 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కాకినాడలోని బెస్ట్ కెరీర్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91547 62596, 95152 58225 నంబర్లను సంప్రదించాలన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తుని: స్థానిక పాత బజారువీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, సామూహిక పూజలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో ఆదివారం గ్లోబల్ హ్యాండ్‌వాష్ డేను ఘనంగా నిర్వహించారు. హ్యాండ్ వాష్ చేసుకోకపోవడం వల్ల కలిగే నష్టాలను వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులి రామకృష్ణ, మామిడి నరసింహమూర్తి, ఏఎన్‌ఎంలు వల్లూరి వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు చెవల కుమారి, దొమ్మేటి శాంత కుమారి, పల్లా జ్యోతి పాల్గొన్నారు.



కొత్త సూరవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రరావు, భక్తులు



రౌతులపూడిలో కనకదుర్గమ్మ ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు



ఏలేశ్వరంలో దుర్గాదేవిని దర్శించుకున్న భక్తులు



ప్రత్తిపాడులో కలశాలతో ఊరేగింపు

దుర్గాదేవీ నమోస్తుతే..

- శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- గ్రామాల్లో పండగ వాతావరణం

తుని: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తుని పట్టణంలోని 6, 9, 11 వార్డుల్లో కొలువుదీరిన అమ్మవారిని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు దర్శించి పూజలు చేశారు. కౌన్సిలర్లు సూరిశెట్టి సుభద్రాదేవి, వాసంశెట్టి శ్రీను, మాజీ కౌన్సిలర్ మంతిన గోవిందరాజులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: దేవీశరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద, స్థానిక పంచాయతీ సమీపంలోని దుర్గమాత ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాలను నెలకొల్పారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం అభిషేకాలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



శంఖవరంలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆదివారం దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 23 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. శంఖవరంలో మహిళలు కలశాలతో భారీగా ఊరేగింపు నిర్వహించారు. కత్తిపూడి, జి.కొత్తపల్లి, సీతంపేట గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తుని రూరల్: మండలంలో కనక దుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి నిలువెత్తు విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. కొత్త సూరవరంలో ఎస్‌డీజీ బాయ్స్ దుర్గాంబికా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు దర్శించి పూజలు చేశారు. ఎస్.చామవరంలో నిర్వహించిన శరన్నవరాత్ర ఉత్సవాల్లో తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శత చండీయాగ సంకల్ప పూర్వక గురువందనం, రాజరాజేశ్వరి అమ్మవారికి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోవదేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. తేటగుంట, డి.పోలవరం, హంసవరం, ఎస్.అన్నవరం, కేఓ.మల్లవరం, రేఖవానిపాలెం, ఎన్.సూరవరం, కొలిమేరు, వి.కొత్తూరు, టి.తిమ్మాపురం, తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని ఆలయాల వద్ద దుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను నెలకొల్పారు. స్థానిక తోట వీధిలో ఆలయం వద్ద సామంతుల శ్రీకృష్ణ, పార్వతి దంపతులు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని లింగవరం కాలనీలో జేవీఆర్ ట్రస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలను ప్రారంభించారు. దిబ్బలపాలెం సంతోషిమాత గుడి వద్ద అజిత్ చక్రవర్తి, రంజిత్ చక్రవర్తి దంపతుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

గండేపల్లి: మండలంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



గోపాలపట్నంలో బాలాత్రిపురసుందరి అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు

రౌతులపూడి: మండల వ్యాప్తంగా ఆదివారం దేవీనవరాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రౌతులపూడి సినిమా సెంటర్‌లో వెలసిన కనకదుర్గమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు కళశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారిని వసంత జలాలతో అభిషేకించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని ఎస్.పైడిపాల, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, గిడజాం, ఉప్పంపాలెం, పి.చామవరం. ఎన్ఎన్.పట్నం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



వెండి, బంగారు ఆభరణాలతో బాలత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన గోకవరం దేవీచౌక్ దుర్గమ్మ

కిర్లంపూడి: దసరా వేడుకల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు మురళీ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలాత్రిపురసుందరీదేవి దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాలు మండలంలో ఆదివారం ఘనంగా ప్రారంభయ్యాయి. గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో ఉదయం కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీభక్తులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత అమ్మవారికి అలంకరించే వెండి, బంగారు ఆభరణాలు, గజమాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు. స్థానిక వీరభద్రునిగద్దెలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని కనకదుర్గమ్మ తొలిరోజు శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు శ్రీగాయత్రీదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ, వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ వార్ల గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కన్నులపండువగా కలశయాత్ర

కోటనందూరు: మండలవ్యాప్తంగా దేవీనవరాత్ర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కాకరాపల్లి ఊరచెరువులో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి కలశయాత్ర కన్నుల పండువగా జరిగింది. తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారు శ్రీస్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

బాలాత్రిపురసుందరిగా నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: దసరా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొండంగి, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, వేమవరం, పైడికొండ, బెండపూడి, ఏవీ నగరం, పెరుమాళ్లపురం, పి.అగ్రహారం, అద్దరిపేట తదితర గ్రామాల్లోని దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జగ్గంపేట: మండలంలోని రామవరంలో నెలకొలిన కనకదుర్గ అమ్మవారిని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం దర్శించుకుని పూజలు నిర్వహించారు

రత్నగిరిపై దసరా వేడుకలకు శ్రీకారం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశ స్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేశారు. తొలుత దర్బారు మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు, 16 మంది అర్చకులకు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు దీక్షా వస్త్రాలు అందజేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు శ్రీసూక్తం, పురుషసూక్తం, మన్యుసూక్తం, లలితా, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. లింగార్చన, నవావరణార్చన, సూర్య నమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి సత్యదేవుని ప్రధానాలయంతో పాటు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లో లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. తొలి రోజు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను బాలాత్రిపుర సుందరి అవతారంలో అలంకరించి పూజించారు. ఈసారి దర్బారు మండపంలో కూడా సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని కూడా బాలాత్రిపుర సుందరిగా అలంకరించి, పూజలు చేశారు.



బాలాత్రిపుర సుందరిగా వనదుర్గ



కనకదుర్గ అమ్మవారు

సాయంత్రం అర్చనలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు శ్రీస్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద గల అభయ దుర్గాదేవి ఆలయంలోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలశాలతో అమ్మవారి ఊరేగింపు

ప్రత్తిపాడు కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అభయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని 108 మంది ముత్తయిదవులు, మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్దాపురం నుంచి తీసుకువచ్చిన దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలోని మెయిన్‌రోడ్డు, పల్లపు వీధి, మునసుబు గారి రామాలయం వీధి, తోట వీధి తదితర ప్రాంతాల్లో ఊరేగించి ప్రతిష్ఠించారు. ఊరేగింపులో చిన్నారుల



కాకరాపల్లిలో కలశయాత్ర చేస్తున్న మహిళలు



తునిలో కనకదుర్గమ్మను దర్శించుకున్న సీపీ సుధారాణి, ఏలూరి బాలు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

గోకవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం విజయవాడ బ్లాసమ్స్ హాస్పిటల్, స్థానిక సుప్రజ క్లినిక్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్ ప్రారంభించారు. చిన్నారులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు బ్లాసమ్స్ ఆస్పత్రి డాక్టర్లు సీహెచ్ జ్యోతి, కె.మహాలక్ష్మి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 400 మంది వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, ముత్యం నాని తదితరులు వైద్య శిబిరాన్ని సందర్శించారు.



మెగా వైద్య శిబిరంలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

నేడు పెద్దిపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాఠశాలలో పాముల హల్‌చల్

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పాములు హల్‌చల్ చేశాయి. నాడు–నేడు పనులలో భాగంగా పాఠశాలలో ఉంచిన ఐరెన్ ఊసలు తీసేందుకు కూలీలు ప్రయత్నించగా కొన్ని పాములు బయటకు వచ్చాయి. వాటిలో కొన్ని చెల్లాచెదరైపోగా ఒకటి కిటికీ గుండా తరగతి గదిలోకి ప్రవేశించింది. దానిని గమనించిన ఒక కుక్క దానిని కొరికి చంపేసింది.



కిటికీ నుంచి తరగతి గదిలోకి వెళ్తున్న పాము

రామ్మూర్తి శర్మకు ఘన నివాళులు



తుని మున్సిపల్ హైస్కూల్‌లో రామ్మూర్తి శర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తుని: ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన గాంగేయుల రామ్మూర్తిశర్మ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు కొనియాడారు. స్థానిక బ్యాంకు కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రామ్మూర్తి శర్మ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎంగా, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా ఆయన 35 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఉపాధ్యాయులు కుక్కుటేశ్వరరావు, చల్లారావు, సత్యనారాయణ, నాగభూషణం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తిపూడి గ్రామానికి చెందిన తురుపాటి లక్ష్మి (73) బంకు సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఏలేశ్వరం: భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలను కొనియాడారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగమూర్తి, యూటీఎఫ్ అధ్యక్షుడు ఆదివిష్ణు, కార్యదర్శి కె.రవి, కోరాడ రాజు, గంపా చరణ్‌తేజ్, గొల్ల విజయ్, అంబటి భరత్, గుడివాడ హరీష్, తోట రాజేష్, నిమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం

జగ్గంపేట: స్థానిక వివేకానంద విద్యా సంస్థల్లో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. పేపర్‌బాయ్ నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీనివాస్, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దుర్గారావు తదితరులు

పశువులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు

కిర్లంపూడి: మూగజీవాలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ ఎన్.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం నుంచి హైదారాబాద్‌కు 7 ఆవులు, 5 దున్నలను బొలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు ఆదేశాలతో పోలీసులు కృష్ణవరం టోల్‌గేట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. ఆవులను, దున్నలను గోకవరం మండలం కృష్ణుడిపాలెం గోశాలకు తరలించారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌ను సీజ్ చేశారు. పోలీస్ సిబ్బంది ప్రసాద్, సుబ్బిరెడ్డి, నూకరాజు పాల్గొన్నారు.



వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలు